సాక్షి
ఆదిలాబాద్
సోమవారం, 1, మే, 2023



ఘనంగా వాసవీమాత జన్మదినోత్సవం

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి జన్మదిన వేడుకలను జిల్లాకేంద్రంలో ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. 9లో▸

జిల్లాలో 17.4 మి.మీ. వర్షపాతం

ఎదులాపురం: జిల్లాలో పది రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. అన్నదాతను కోలుకోకుండా చేస్తున్నాయి. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 17.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా చూస్తే.. జైనథ్‌లో అత్యధికంగా 50.3 మిల్లీ మీటర్లు, అలాగే ఆదిలాబాద్ అర్బన్‌లో 47.4 మి.మీ, తలమడుగులో 41.4 మి.మీ, భీంపూర్, మావలలో 38మి.మీ, బేలలో 16 మిల్లీమీటర్లు నమోదయింది. గాదిగూడలో ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. మిగిలిన మండలాల్లో స్వల్పంగా నమోదైంది.

గరిష్టం/కనిష్టం
32.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ 'సోయం'



కేంద్రమంత్రికి ఆహ్వానపత్రిక అందజేస్తూ..

ఆదిలాబాద్: ఎంపీ సోయం బాపురావు ఆదివారం కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిని నాగపూర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. తన పెద్ద కుమారుడు వెంకటేశ్ వివాహానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాల్లో ఇంటర్, డిగ్రీలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఇంటర్ పరీక్ష కోసం 5, డిగ్రీ కోసం 2 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ పరీక్షకు 1,286 మందికి గాను 1129 మంది హాజరయ్యారు. 127 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీపరీక్షకు 133 మందికి గాను 118 మంది హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ నటరాజ్, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలల ఆర్సీవో గోపిచంద్, డీసీవో అంజలికుమారి తదితరులు పరిశీలించారు.

ముగిసిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు గడువు



కార్యాలయంలో దరఖాస్తుదారుల సందడి

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించిన దరఖాస్తు గడువు ఆదివారంతో ముగిసింది. 125 చదరపు గజాల లోపు స్థలాలు కలిగిన పేదలకు ఉచితంగా, అంతకు మించి విస్తీర్ణం కలిగిన భూములకు మార్కెట్ ధర ప్రకారంగా రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం 58, 59 జీఓలను జారీ చేసింది. వీటి కోసం అర్హులైన వారి నుంచి ఈ ఏప్రిల్ 1నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఆదివారం చివరి రోజు కావడంతో దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో బల్దియా కార్యాలయానికి తరలివచ్చారు. సెలవు రోజైనా మున్సిపల్ అధికారులు నాలుగు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మ్యాన్‌వల్‌గా దరఖాస్తులు స్వీకరించిన అధికారులు వాటిని ఆన్‌లైన్ చేయనున్నారు. తదుపరి ప్రభుత్వ ఉత్తర్వుల కనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి క్రమబద్ధీకరించనున్నారు.

కాసుపత్రులు

- ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో శుక్రవారం ఓ గర్భిణీ ప్రసవం కోసం చేరింది. వైద్యురాలు ఆమెకు సిజేరియన్ చేయగా పాప జన్మించింది. తీవ్ర రక్తస్రావం అయిన క్రమంలో ఏకంగా గర్భసంచినే తొలగించారు ఆ డాక్టర్. ఆరోగ్య పరిస్థితి విషమించగా పక్కనే ఉన్న మరో ఆస్పత్రిలో ఆమెను అడ్మిట్ చేశారు. ఆ ఇద్దరు వైద్యులు కూడా అందుబాటులో లేకుండా సిబ్బందే ట్రీట్‌మెంట్ చేయడంతో బాలింత మృతిచెందింది. ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.
- ఏడాది క్రితం ఆదిలాబాద్ పట్టణం బస్టాండ్ సమీపంలో గల ఓ నర్సింగ్ హోమ్‌లో ఇద్దరు బాలింతలు నెలలోపే మృతిచెందడం కలకలం రేపింది. వైద్యం వికటించడంతో ఓ బాలింత మృతిచెందగా, ఇదే ఆస్పత్రిలో మరో ఘటన సైతం చోటు చేసుకుంది. బంధువులు ఆందోళనతో విషయం బయటకు వచ్చింది. వైద్యులు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి సర్దుబాటు చేసుకున్నట్లు సమాచారం.
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఆదిలాబాద్ పట్టణంలో కొంతమంది ప్రైవేట్ వైద్యులు ఐదారేళ్లుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. మొదట చిన్నపాటి క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని ఔట్ పేషెంట్లకు చికిత్స అందించేవారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో ఆస్పత్రులు నిర్మించారు. అయితే ఇక్కడ చికిత్స పొందిన రోగుల గుండె మాత్రం గుబిల్లు అనేవిధంగా బిల్లులు వేస్తున్నారు. అత్యవసర సమయంలో రిమ్స్‌కు వెళితే వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో గత్యంతరం లేక వీరిని ఆశ్రయిస్తే ఇలా దోపిడీకి పాల్పడుతున్నారు.



- జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ
- ధనార్జనే ధ్యేయంగా నర్సింగ్ హోమ్‌ల నిర్వహణ
- నిర్లక్ష్య వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటం
- తనిఖీలు మరిచిన అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. అత్యవసర సమయంలో చికిత్స కోసం వచ్చిన వారి నుంచి ఇష్టారీతిన ఫీజుల రూపేనా వసూలు చేస్తూ రోగుల జేబులు ఖాళీ చేస్తున్నారు. ఒక్కోసారి ప్రాణాలు పోతున్నా పట్టించుకోకుండా రోగుల బంధువులదే తప్పంటూ దబాయిస్తున్నారు. జిల్లాలోని ఆయా చోట్ల ఏడాది క్రితం ప్రారంభించిన క్లినిక్‌లు ప్రస్తుతం నర్సింగ్ హోమ్‌లుగా మారాయి. ఇక్కడికి వైద్యం కోసం వస్తే రోగి ప్రాణాల మీదికి వచ్చిన తర్వాత రిఫర్ చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. వైద్యం వికటించి మృత్యువాత పడుతున్న సమయంలో బాధిత కుటుంబాలకు ఎంతో కొంత ముట్టజెప్పి చేతులెత్తేస్తున్నారు. మళ్లీ షరామామూలే అన్నవిధంగా తమ పని కానిచ్చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల ఇలాంటి ఘటనలు అనేకంగా చోటు చేసుకున్నాయి. రోగుల బంధువులు ఆందోళన చేస్తే తప్పా విషయాలు బయటకు రాని పరిస్థితి.

రోగుల ప్రాణాలతో చెలగాటం..

జిల్లాలోని పలు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. ఆస్పత్రులకు అనుబంధంగా ల్యాబ్‌లు, మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందులో అర్హత లేని వారితో టెస్ట్‌లు చేయిస్తుండడం గమనార్హం. దీంతో ఒక్కోల్యాబ్‌లో ఒక్కోతీరు రిపోర్ట్ వస్తుండడంతో రోగులు అయోమయానికి గురవుతున్నారు. ఇక మెడికల్ షాపుల్లో డీఫార్మసీ, బీ ఫార్మసీ చదివిన వారు మాత్రమే మందులు అందించాలి. కానీ చాలా చోట్ల ఆ సర్టిఫికెట్లు లేని వారితోనే మమ అనిపిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేయకపోవడంతో వీరి ఆగడాలు మితిమీరితున్నాయనే విమర్శలున్నాయి.

రిమ్స్ వైద్యులది అదే దారి..

జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో పనిచేస్తున్న చాలా మంది వైద్యులు పట్టణంలో ప్రైవేట్ క్లినిక్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు రిమ్స్‌లో రోగులకు సేవలు అందించాల్సిన వారు మధ్యాహ్నమే క్లినిక్ బాట పడుతున్నారు. దీంతో మధ్యాహ్నం 2 నుంచి రిమ్స్‌కు వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. అత్యవసర సమయంలో వచ్చిన వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఆయా వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు సంబంధిత వైద్యులకు వాట్సాప్ ద్వారా మెస్సేజ్ చేస్తే వారు అందించాల్సిన వైద్యంను వివరిస్తున్నారు. ఇది బహిరంగ రహస్యమే అయినా ఉన్నతాధికారులు దీనిపై స్పందించడం లేదు.

కాసుల కోసం కక్కుర్తి..

ఆదిలాబాద్ పట్టణంలో ప్రైవేట్ వైద్యం దందాగా మారింది. ఆస్పత్రికి వెళ్లిన రోగులకు అవసరం లేకున్నా పరీక్షలు చేస్తూ నిలువు దోపిడీకి గురిచేస్తున్నారు. సర్కారు ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందడం లేదని ప్రైవేట్‌కు వెళ్లిన వారికి వైద్యం మాట దేవుడెరుగు కానీ బిల్లు మోత మోగిస్తున్నారు. రోగి పరిస్థితి విషమిస్తున్న సమయంలో సంబంధిత ఆస్పత్రుల వైద్యులు రిమ్స్, హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్, యవత్మాల్ ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. ఆ సమయంలో డబ్బులు చెల్లిస్తే తప్పా కదలనివ్వడం లేదు. రోగి మృతిచెందిన సమయంలో కూడా మృతదేహాన్ని అప్పగించకుండా బిల్లులు వసూలు చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

తనిఖీలు నిర్వహిస్తాం

జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం బాలింత మృతి ఘటనపై విచారణ చేపడతాం. వైద్యుల నిర్లక్ష్యం ఉంటే శాఖాపరమైన చర్యలు తప్పవు. అలాగే నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం తనిఖీలు జరుపుతాం. – నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

కదలరు.. వదలరు!

- ఏళ్లుగా బల్దియాలో పాతుకుపోయారు
- అవినీతి ఆరోపణలున్నా.. రాజకీయ పలుకుబడితో నెట్టుకొస్తున్నారు
- ఆదిలాబాద్ మున్సిపల్‌లో ఇద్దరు అధికారుల తీరిది



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

కైలాస్‌నగర్: ప్రభుత్వ అధికారి ఒక స్థానంలో మూడేళ్లకు మించి పని చేయకూడదనేది నిబంధన. గరిష్టంగా ఐదేళ్ల వరకు ఉండవచ్చు. అయితే ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మాత్రం ఆ ఇద్దరు అధికారులకు ఈ నిబంధనలేమి వర్తించడం లేదు. దీర్ఘకాలంగా ఒకే చోట పాతుకుపోయారు. రాజకీయ పలుకుబడితో బదిలీ కాకుండా చూసుకుంటున్నారు. ఇక్కడి నుంచి కదలడం లేదు. పోనీ వారు జాబ్‌చార్టు ప్రకారం పనిచేస్తున్నారా అంటే అదీ కాదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ వారిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వ్యక్తమవుతున్నా వారిని ఇక్కడి నుంచి బదిలీ చేయడం లేదు. సదరు అధికారుల అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదులు అందుతున్నా ఎలాంటి చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇందుకు రాజకీయ అండదండలే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఎనిమిదేళ్లుగా ఒకేచోట..

ఆదిలాబాద్ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో ఓ దిగువస్థాయి అధికారి ఎనిమిదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారు. చెప్పుకోవడానికి సాధారణ అధికారే అయినా ఆ విభాగంలో పూర్తి అధిపత్యం ఆయనదేనని బల్దియా ఉద్యోగులు, సిబ్బంది పేర్కొంటున్నారు. ఆ విభాగానికి సంబంధించి పట్టణంలో ఎలాంటి పనులు చేపట్టాలన్నా, టెండర్లు పిలవాలన్నా, వార్డులకు నిధులు కేటాయించాలన్నా ఆయన అనుమతి మేరకే జరుగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోవడం, రాజకీయ అండదండలు ఉండటంతో ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు న్నాయి. చేయని పనులకు చేసినట్లుగా రికార్డులు నమోదు చేసి బిల్లులు లేపుకుంటున్నట్లుగా సైతం అనేక ఫిర్యాదులు అందాయి. ఇదిలా ఉంటే సదరు అధికారే బినామీ పేర్లతో కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి పట్టణంలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లుగా తెలుస్తోంది. పర్యవేక్షించాల్సిన సదరు అధికారే పనులు చేస్తుండటంతో పర్యవేక్షణ కొరవడి నాణ్యతలోపిస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సిబ్బంది లేకపోవడమే ఆయనకు వరం

బల్దియాలో మరో కీలకమైన పట్టణ ప్రణాళిక విభాగంలోనూ ఓ అధికారి ఏడేళ్లుగా ఒకే చోట పని చేస్తున్నారు. సదరు విభాగానికి సంబంధించి దిగువ స్థాయి అధికారి అయినా అందులో ఏ పని జరుగాలన్నా ఆయనదే కీలకపాత్ర. సదరు అధికారి పైన మరో ఇద్దరు అధికారులు ఉన్నా ఒకరు వయస్సు పైబడటంతో కార్యాలయానికే పరిమితమవుతున్నారు. మరో అధికారికి ఆ విభాగంపై అంతగా పట్టులేదు. దీంతో వ్యవహారాలన్నీ ఈయనే చూడాల్సి వస్తోంది. దీన్ని సదరు అధికారి తనకు అనుకూలంగా మలుచుకుంటున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని అక్రమ లేఅవుట్లు, అక్రమ భవన నిర్మాణాలు, ప్రభుత్వ, మున్సిపల్ స్థలాల కబ్జా వంటి వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించాల్సింది ఈ విభాగం అధికారులే. వీటిపై ఎలాంటి ఫిర్యాదు అందినా సదరు అధికారే పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆయన అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలున్నాయి. క్షేత్రస్థాయిలో అక్రమాల పరిశీలనకు వెళ్లేటప్పుడు ఒంటరిగానే వెళుతుండటం సదరు అధికారిపై వస్తున్న ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తుంది. ఇలా రెండు కీలకవిభాగాల్లో ఏళ్లుగా పాతుకుపోయిన సదరు అధికారులు రెండు చేతులా అర్జిస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

జేపీఎస్‌లను విస్మరించడం దురదృష్టకరం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

కైలాస్‌నగర్: కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఫైల్‌పై సంతకం చేసిన సీఎం కేసీఆర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను విస్మరించడం దురదృష్టకరమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ ఆరోపించారు. తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు తలపెట్టిన సమ్మె మూడో రోజుకు చేరింది. ఆదివారం సెలవు రోజైనా పంచాయతీ కార్యదర్శులు సాయంత్రం వరకు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించేవరకు సమ్మెను ఆపేదిలేదని స్పష్టం చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీపికబురు

- క్రమబద్ధీకరణ ఫైల్‌పై సీఎం సంతకం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: కొన్నేళ్లుగా ప్రభుత్వశాఖల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఆదివారం హైదరాబాద్‌లో నూతన సెక్రటేరియట్ ప్రారంభోత్సవం సందర్భంగా వీరిని క్రమబద్ధీకరిస్తూ సీఎం కేసీఆర్ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. మొత్తం 40 విభాగాల్లో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేశారు. ఈ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

వీరికి ప్రయోజనం..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు ప్రయోజనం చేకూరింది. జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా 124 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. వీరితో పాటు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పనిచేస్తున్న ఏడుగురు కాంట్రాక్ట్ లెక్చరర్లను, ఆదిలాబాద్, ఉట్నూర్ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 13 మంది లెక్చరర్లను, ఉట్నూర్‌లోని ఐటీఐలో పనిచేస్తున్న ముగ్గురికి ప్రయోజనం చేకూరనుంది. అలాగే వైద్యారోగ్య శాఖలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సులు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ తదితరుల ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేశారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



జిల్లాలో 124 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాబోధన చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయడం సంతోషంగా ఉంది. వారికి రుణపడి ఉంటాం. –గాజుల శ్రీనివాస్, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

అందిపుచ్చుకుంటే అవకాశాలెన్నో..!

- ఉమ్మడి జిల్లాకు నాలుగు డ్రైవింగ్ స్కూల్స్
- రెండేళ్ల క్రితమే అనుమతులు
- అభ్యర్థులు రాక ప్రారంభం కాని శిక్షణ
- కొరవడిన ప్రచారం



డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్ గది

మంచిర్యాలఅర్బన్: మారుతున్న కాలంలో వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. కొత్తగా డ్రైవింగ్ నేర్చుకోవాలంటే కుటుంబ సభ్యులు, తెలిసిన వారి ద్వారా నేర్చుకుంటారు. లేదంటే డ్రైవింగ్ స్కూల్‌కు వెళ్తారు. ద్విచక్ర వాహనాలు, కార్లు నడపడం నేర్చుకునేందుకు ప్రత్యేకంగా డ్రైవింగ్ స్కూల్స్ ఉన్నాయి. మరి భారీ వాహనాలు నడపడం నేర్చుకోవాలంటే ఎంతో కట్టుదిట్టమైన శిక్షణ అవసరం. భారీ వాహనాల డ్రైవింగ్ నేర్పించే సంస్థలు అడపాదడపా ఉన్నా అందులో నైపుణ్యం కలిగిన శిక్షకులు అంతంతమాత్రంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డిపోల్లో డ్రైవింగ్ స్కూల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాలలో ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల క్రితం అనుమతులు లభించాయి. ప్రచారలోపమో.. మరేదైనా కారణమో కానీ డ్రైవింగ్ స్కూల్‌కు ఆదరణ కరువైంది.

ఆర్టీసీలో తర్ఫీదుతో...

ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్‌లో సీనియర్ డ్రైవర్లు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా వాహనం నడపడంపై ఎన్నో మెలకువలు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. డ్రైవింగ్ స్కూల్‌లో కండీషన్ ఉన్న వాహనం (ప్రత్యేక బస్సు)ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. థియరీ బోధనకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయడం ద్వారా తర్ఫీదు ఇవ్వనున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన డ్రైవర్లకు ఆర్టీసీ సంస్థలో మొదట ప్రాధాన్యం కల్పిస్తారు. మరోవైపు ఆర్టీసీలో అద్దెబస్సుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. శిక్షణ పొందిన డ్రైవర్లకు ఇలాంటి బస్సులు నడిపేందుకు అవకాశం కల్పిస్తారు. బయటి డ్రైవింగ్ స్కూల్స్‌లో వాహనాలు ఉన్నా శిక్షణ ఇచ్చేది తక్కువే. దీంతో లారీలు, ఇతర భారీ వాహనాలపై క్లీనర్‌గా వెళ్లి సొంతంగా నేర్చుకున్న వారిలో నైపుణ్యత లేకపోవడంతో ఉపాధి అవకాశాలు కూడా తక్కువగానే ఉంటాయి.

శిక్షణ విధానం ఇలా..

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కేంద్రం తెరిచి ఉంటుంది. శిక్షణ పొందే అభ్యర్థి రూ.15,500 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు మాత్రమే శిక్షణకు అర్హులు. అభ్యర్థులు శారీరక ధారుఢ్యం కలిగిఉండాలి. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ పొంది తప్పనిసరిగా ఏడాది పూర్తయి ఉండాలి. వెసులుబాటును బట్టి ఒక్కో అభ్యర్థికి 36 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. మొత్తం 16 గంటలు థియరీ తరగతులు, 20 గంటలు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్టీసీలో శిక్షణ తీసుకున్నవారికి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రచార లోపంతోనే..

ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌లో ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయి. ఇందులో ఆదిలాబాద్ మినహాయిస్తే ఎక్కడా అభ్యర్థుల నుంచి స్పందన కరువైంది. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు అవకాశాలపై విస్తృతంగా ప్రచారం లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం కావాలంటే ఒక బ్యాచ్‌లో 16 మంది అవసరం. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే శిక్షణ షురూ చేస్తారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మోటర్ డ్రైవింగ్ స్కూల్‌పై ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రచారం నిర్వహిస్తాం

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌పై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తాం. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వస్తే శిక్షణ ప్రారంభిస్తాం. ఆర్టీఏ నిబంధనల మేరకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశాం. శిక్షణకు అవసరమైన ప్రత్యేక బస్సు అందుబాటులో ఉంది. – రవీంద్రనాథ్, డీఎం, మంచిర్యాల

జంటహత్యల కలకలం

- గుడిహత్నూర్ శివారులో మృతదేహాలు
- జిల్లా కేంద్రానికి చెందిన రహమాన్, వివాహిత అశ్వినిగా గుర్తించిన పోలీసులు



ఘటనా స్థలంలో రహమాన్ మృతదేహం



సోన్‌కాంబ్లే అశ్విని మృతదేహం



సీతాగోంది పంచాయతీ వద్ద సీసీ కెమెరాలో రికార్డయిన మృతుల ఫుటేజీ

గుడిహత్నూర్: ఆదిలాబాద్‌జిల్లా గుడిహత్నూర్ మండలం సీతాగోంది పంచాయతీ పరిధిలోని గర్కంపేట సమీపంలో లభ్యమైన జంట మృతదేహాలు ఆదివారం కలకలం రేపాయి. కుళ్లిపోయే దశలో చేనులో పడి ఉన్న మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుల తలలు తీవ్రంగా గాయపరిచి హత్య చేసినట్లగా ప్రాథమికంగా నిర్ధారించారు.

హత్యకు గురైంది వీరే..

ఘటనాస్థలం సమీపంలోని బీటీరోడ్డుపై నిలిచిన ఉన్న స్కూటీని పరిశీలించిన పోలీసులు వాహన నంబర్ ఆధారంగా ఆరా తీయగా మృతుడు జిల్లా కేంద్రంలోని భక్తాపూర్‌కు చెందిన మహమ్మద్ రహమాన్ (20)గా గుర్తించారు. సమీపంలోనే ఉన్న యువతి మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన వివాహిత సోన్‌కాంబ్లే అశ్విని (28)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నైలు, ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో..

మృతులిద్దరూ ఒకే రకం దెబ్బలతో చనిపోవడంతో హత్యగా భావించిన పోలీసులు క్లూస్ టీంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలు కుళ్లిపోయేస్థితిలో ఉండడంతో రెండురోజుల క్రితం ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

అక్రమ సంబంధమే హత్యలకు దారితీసిందా?

రహమాన్, అశ్వినిల హత్య వెనుక కారణాలపై మండలంతో పాటు జిల్లా కేంద్రంలో చర్చనీయాంశమైంది. మహమ్మద్ రహమాన్ తన బాబాయికి చెందిన ఆర్టీఏ ఏజెంట్ కార్యాలయంలో ఉండేవాడు. ఇదే క్రమంలో సమీపంలోని స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న సోన్‌కాంబ్లే అశ్వినితో పరిచయం ఏర్పడింది. ఇది అక్రమ సంబంధానికి దారి తీసినట్లు తెలుస్తోంది. కాగా అశ్విని భర్త రమేశ్ ట్రాక్టర్‌పై కూలిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమారుడు లోకేష్ (8), కూతురు సునాక్షి (4)ఉన్నారు. అయితే గత శుక్రవారం రహమాన్ తన అన్నకు చెందిన స్కూటీపై అశ్వినిని తీసుకొని సీతాగోంది మీదుగా గర్కంపేట వైపు వెళ్లాడు. ఈ దృశ్యాలు సీతాగోంది పంచాయతీ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అయితే వారు తిరిగి ఇంటికి చేరుకోకపోగా హత్యకు గురవడం ఇరుకుటుంబాలను కలచివేసింది. బంధువులు రోదనలు మిన్నంటాయి.

జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత

ఆదిలాబాద్: మృతదేహాలను రిమ్స్‌కు తరలించగా ఇరు కుటుంబాలు, బంధువులు అక్కడికి చేరుకున్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే మృతులకు సంబంధించిన కాలనీల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

సచివాలయ ప్రారంభోత్సవంలో మనోళ్లు

- మంత్రి ఐకేరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు



మంత్రి ఐకేరెడ్డితో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రాహుల్‌రాజ్, వరుణ్‌రెడ్డి, హేమంత్, సంతోష్



మంత్రి ఐకేరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజా ప్రతినిధులు

నిర్మల్‌టౌన్/ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయాన్ని సీఎం కేసీఆర్ ఆదివారం ప్రారంభించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు హాజరయ్యారు. నాలుగో అంతస్తులోని తన ఛాంబర్‌లో ఆసీనులైన రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఐకేరెడ్డి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు జిల్లాల్లోగల 100 ఆలయాలకు ధూపదీప నైవేద్యపథకాన్ని వర్తింపజేసే.. ప్రధాన ఆలయాల్లో మిల్లెట్ ప్రసాదాన్ని అందుబాటులోకి తెచ్చే ఫైళ్లపై సంతక చేశారు. మంత్రిని కలిసినవారిలో కలెక్టర్లు రాహుల్‌రాజ్, వరుణ్‌రెడ్డి, హేమంత్, సంతోష్, ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్‌రెడ్డి, జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, కోనేరు కోన ప్ప, దుర్గం చిన్నయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



ఫైల్‌పై సంతకం చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

క్లుప్తంగా

కలప వాహనం పట్టివేత


పట్టుకున్న వాహనం వద్ద ఎఫ్ఆర్వో గులాం మొయినొద్దీన్, తదితరులు

ఉట్నూర్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న కలప వాహనాన్ని అల్లంపెల్లిలో ఆదివారం పట్టుకున్నట్లు బీర్సాయిపేట్ ఎఫ్ఆర్వో గులాంమొయినొద్దీన్ తెలిపారు. పక్కా సమాచారంతో అల్లంపెల్లి నుంచి ఉట్నూర్‌కు బొలెరో వాహనంలో అక్రమ కలపను తరలిస్తుండడంతో వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వెంబడిస్తున్న సమయంలో డ్రైవర్ వాహనం వదిలి పారిపోయారని అన్నారు. పట్టుకున్న 17 టేకు దుంగలు, వీటి విలువ సుమారు రూ. 94,500 ఉంటుందన్నారు. వాహనాన్ని రేంజ్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కవ్వాల్ టైగర్‌జోన్ నుంచి అక్రమంగా కలప రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో హెచ్చరించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి గోవింద్, బీట్ అధికారులు అజయ్, ప్రతాప్, బలవంత్‌రావు, సిబ్బంది ఉన్నారు.

20 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని మంచిర్యాల ఎక్స్‌రోడ్ వద్ద పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించారు. పలువురు వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా 20 మంది మద్యం తాగినట్లు తేలింది. ఇందులో ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ ఉన్నారు.

వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి


దుప్పి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

కడెం: మండలంలోని పెద్దూర్‌తండా సమీపంలోని ప్రధాన రహదారిపై ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతిచెందింది. సమాచారం అందుకున్న ఆటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతిచెందిన దుప్పిని జీపులో తీసుకెళ్లి సమీప ఆటవీ ప్రాంతంలో పూడ్చిపెట్టారు. ఎఫ్‌బీవో లచ్చన్న, సిబ్బంది కమర్ తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బాబాపూర్ శివారులోని అటవీ ప్రాంతంలో ఆదివారం గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్సై భరత్‌సుమన్ కథనం ప్రకారం.. బాబాపూర్ శివారులో చెట్టుకు ఓ యువకుడు (35) ఉరి వేసి మృతిచెంది ఉండగా అటుగా వెళ్తున్న గ్రామస్తులు తమకు సమాచారం అందించారు. మృతుడు చెట్టుకు ఉరి వేసుకున్నాడా, ఎవరైనా ఉరివేసి హతమర్చారా అనేది పోలీసుల దర్యాప్తులో తేలనుంది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో వైరల్ అయింది. మృతుడి వివరాలు తెలిస్తే ఉట్నూర్ ఎస్సై 8712659939, సీఐ 8712659937 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్జీయూకేటీలో సేవ్ వాటర్ ర్యాలీ


ర్యాలీలో డైరెక్టర్ సతీశ్‌కుమార్, విద్యార్థులు

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీలో ఆదివారం సేవ్ వాటర్ పేరిట విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నీటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ చేపట్టారు. డైరెక్టర్ సతీశ్‌కుమార్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పీయూసీ విభాగం నుంచి క్యాంపస్ హెల్త్‌సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు.

ఘనంగా పెర్సపేన్ పూజలు

వడగామ్‌లో పూజలు చేస్తున్న ఆత్రం వంశీయులు



పెర్సపేన్ దేవతకు పూజలు చేస్తున్న ఆత్రం వంశీయులు



శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు, ఆత్రం వంశీయులు



ఇంద్రవెల్లి: వైశాఖమాసం పురస్కరించుకుని మండల కేంద్రంతోపాటు ఆదివాసీ గిరిజన గ్రామాల్లో జంగుబాయి, బీమల్‌దేవుడు, పెర్సపేన్ దేవతల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వడగామ్ గ్రామంలో ఆదివారం కోర్‌కార్ ఆత్రం వంశీయులు పెర్సపేన్(పెద్ద దేవుడు)కు పూజలు చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని పుణ్యక్షేత్రంలో స్నానాలచరించి రాత్రి మహాపూజ నిర్వహించి మొక్కు చెల్లించారు. ఆత్రం వంశీయుల మరణించిన వారి పేరుతో తూమ్(కర్మకాండ) పూజలు చేశారు. ఆత్రం వంశం పూజారి ఆత్రం శేఖు, ఆత్రం వంశీయులు ఆత్రం శంకర్, ఆత్రం సీతారం, ఆత్రం మనోహర్, ఆత్రం మారుతి తదితరులు ఉన్నారు.

బస్సుల్లో నెలవారీ పాస్‌లు

- కిలోమీటర్ ఆధారంగా ఇవ్వాలని ఆర్టీసీ నిర్ణయం
- పాసుల జారీలో స్లాబ్ విధానం ఎత్తివేత
- ప్రయాణికులకు శుభవార్త

నెలవారీ రూట్‌పాసుల వివరాలు

నిర్మల్-భైంసా	రూ.2,550
నిర్మల్-ఆర్మూర్	రూ.2,950
నిర్మల్-నిజామాబాద్	రూ.4,550
నిర్మల్-ఆదిలాబాద్	రూ.4,950
నిర్మల్-గుడిహత్నూర్	రూ.4,150
నిర్మల్-ఇచ్చోడ	రూ.3,350
నిర్మల్-నేరడిగొండ	రూ.2,550



నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్

నిర్మల్‌చైన్‌గేట్: నష్టాలను అధిగమించి అదనపు ఆదాయ ఆర్జనపై ఆర్టీసీ దృష్టి సారించింది. కార్గో సేవలను విస్తృతం చేయడం, ప్రయాణికులను ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాలకు ప్యాకేజీలు ప్రవేశపెట్టడం, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడపడం లాంటి చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కిలోమీటర్ ఆధారంగా నెలవారీ బస్‌పాస్‌లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అమలులో ఉన్న స్లాబ్ విధానాన్ని ఎత్తివేసింది. టోల్‌గేట్ చార్జీ కూడా బస్‌పాస్‌తోపాటే వసూళ్లు చేయాలని నిర్ణయం తీసుకుంది.

కిలోమీటర్ ఆధారంగా..

ప్రస్తుతం అమలులో ఉన్న స్లాబ్ విధానాన్ని ఎత్తివేసి కిలోమీటర్ల ఆధారంగానే పాసులు జారీ చేయనున్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్ నెలవారీ బస్‌పాస్‌ల్లో గతంలో స్లాబ్ విధానం అమల్లో ఉండేది. ఉదాహరణకు.. ఒకరు 51 కి.మీ ప్రయాణిస్తే 55 కిలోమీటర్లకు నెలవారీ బస్‌పాస్ మంజూరు చేసేది. ఇక మీదట 51 కి.మీ బస్‌పాస్ ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. స్లాబ్ విధానాన్ని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు కిలోమీటర్ దీనితో ఇప్పుడు 20 రోజుల బస్‌చార్జీ ఎంత ఉంటే అంతే చార్జీ వసూళ్లు చేస్తామని ఈ నిర్ణయం నెలవారీ బస్‌పాస్‌దారులకు ఎంతో మేలు చేస్తుందని అధికారులు చెబుతున్నారు.

టోల్‌తో పాటే నెలవారీ టికెట్..

నెలవారీ సీజన్ టికెట్ కొని 20 రోజుల చార్జీ చెల్లించి 30 రోజులు ప్రయాణించే వారికి ఆర్టీసీ శుభవార్త తెలిపింది. నేటి నుంచి నెలవారీ సీజన్ టికెట్‌లో టోల్ ప్లాజా రుసుము కలిపి టికెట్లు విక్రయించనున్నారు. గతంలో ఉద్యోగరీత్యా నిర్మల్ నుంచి ఆదిలాబాద్, నిజామాబాద్, భైంసా రూట్లలో వెళ్లే ప్రయాణికులు నెలవారీ సీజన్ టికెట్ తీసుకునేవారు. కండక్టర్ వద్ద అదనంగా టోల్‌ప్లాజా టికెట్ రూ.10 చెల్లించాల్సిన పరిస్థితి. అదనంగా టోల్ చార్జీలు వసూళ్లు చేయడంతో నెలవారీ సీజన్ టికెట్ తీసుకోవడమే మానేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ సీజనల్ టికెట్‌పై స్లాబ్ విధానాన్ని ఎత్తివేసి కిలోమీటర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. అదనంగా టోల్ ప్లాజాకు మరోసారి టికెట్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. సీజన్ టికెట్ పై ఎన్ని కిలోమీటర్లు ప్రయాణం చేస్తే అంత దానికి డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– సాయన్న, డిపో మేనేజర్, నిర్మల్

కల్యాణ ఘడియలు

- ఈనెల 3 నుంచి మోగనున్న భాజాభజంత్రీలు
- మే, జూన్ నెలల్లో 23 మంచి రోజులు


ఈవెంట్ ఆర్గనైజర్లు, ఫొటోగ్రాఫర్లు, వ్యాపారులు తదితరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: శుభముహూర్తాలు వచ్చేశాయి. గురు మూఢం కారణంగా ఏప్రిల్ నెలలో పెళ్లిళ్లకు శుభముహూర్తాలు లేవు. ఈనెల 3న బుధవారం నుంచి పెళ్లి భాజాభజంత్రీలు మోగనున్నాయి. జిల్లాలో పెళ్లి సందడి నెలకొంది. దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడనున్నాయి. పెళ్లి మండపాలు ముస్తాబవుతున్నాయి. శుభలేఖల ప్రింటింగ్ పనులు పూర్తి కాగా, వంటవారు, భాజాభజంత్రీల వారు, పురోహితులు అంతా సిద్ధమవుతున్నారు.

శుభముహూర్తాలు ఇలా..

ఈనెల 3 నుంచి వరుసగా 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 21, 26, 27, 28, 30, 31, జూన్‌లో 1, 3, 7, 8, 9, 10, 11 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో శుభకార్యాలు జరగనున్నాయి. జూన్ 19 నుంచి ఆషాఢమాసం మొదలై, జులై మొత్తం అధిక శ్రావణం కావడంతో ఆగస్టు 18 వరకు ముహూర్తాలు లేవు. తిరిగి ఆగస్టు 19న మంచిరోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

రద్దీగా దుకాణాలు

ఈనెల 3 నుంచి పెళ్లిళ్ల నేపథ్యంలో బంగారు, వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి. నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఫంక్షన్ హాళ్లు ముందస్తుగా బుక్ అయ్యాయి. ఈసారి అధికంగా ముహూర్తాలు ఉండటంతో నిశ్చితార్థం నుంచి పెళ్లి వరకు మొత్తం 25 రంగాల వారికి చేతినిండా ఉపాధి ఉండనుంది. వేద బ్రాహ్మణులు, బ్యాండ్ మేళం, సౌండ్ సిస్టమ్, లైటింగ్, డెకరేషన్, క్యాటరింగ్, వంటలు చేసేవారు,

రెండునెలల్లో మంచి రోజులు



ఏప్రిల్‌లో ముహూర్తాలు లేవు. మే, జూన్ నెలలో 23 మంచిరోజుల్లో పెళ్లిళ్లు జరగనున్నాయి. జులైలో మంచి రోజులు లేవు. ఆగస్టు 19 నుంచి మంచి రోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

– పట్వారీ శ్రీనివాస్, ఆలయ పూజారి

ప్రశాంతంగా కానిస్టేబుల్ తుది రాతపరీక్ష

- ఆదిలాబాద్‌లో 12 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- 4,768 మంది అభ్యర్థుల హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ


పరీక్ష కేంద్రాల వద్ద చేరుకున్న అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. పరీక్షకు నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ఉదయం 6 గంటల సమయంలో వర్షం కురవడంతో అభ్యర్థులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు గంటకు పైగా భారీ వర్షం కురవడంతో వారు కొంత ఆందోళనకు గురయ్యారు. వర్షం తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4820 మంది హాజరు కావల్సి ఉండగా, 4768 మంది హాజరయ్యారు. 52 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. డీఎస్పీ, సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద పర్యవేక్షణ కొనసాగింది. కేంద్రాల వద్దనే పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పోలీసు వాహనాల్లో పరీక్ష కేంద్రాల వరకు..

ఆదిలాబాద్‌లో భారీ వర్షం కురవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఆయా చోట్ల అభ్యర్థులను గమనించిన పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది వారిని వాహనాల్లో కేంద్రాలకు తరలించారు. ఇదిలా ఉండగా జిల్లా నలుమూలల నుంచి అభ్యర్థులు రావడంతో పట్టణం సందడిగా మారింది. బస్టాండ్ ప్రాంతం వారితో కిటకిటలాడింది. చిన్న పిల్లలతో పరీక్ష కేంద్రానికి వచ్చిన మహిళ అభ్యర్థులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. చిన్న పిల్లలను పరీక్ష కేంద్రం లోనికి అనుమతించక పోవడంతో పరీక్ష అయ్యే వరకు వారి బంధువులు పిల్లల్ని ఆడిస్తూ కనిపించారు.


చిన్నారిని ఆడిస్తున్న మహిళ


కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



అభ్యర్థులను కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు

హోరాహోరీగా కిక్‌బాక్సింగ్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ


తలపడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 29న ప్రారంభమైన తెలంగాణ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు రెండోరోజులుగా హోరాహోరీగా కొనసాగుతున్నాయి. రెండోరోజు కిక్ బాక్సింగ్ పోటీలను జిల్లా అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రారంభించారు. స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్ నిర్వహిస్తున్న ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని అన్నీ జిల్లాల నుంచి సుమారు 1000 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ఒలంపిక్ అసోసియేషన్ తరుపున అబ్జర్వర్‌గా వచ్చిన వివేక్‌ను కిక్ బాక్సింగ్ జిల్లా అసోసియేషన్ తరుపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి శ్రీలత, మహిపాల్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నర్సాపూర్(జి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై పాకాల గీత తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. కుభీర్ మండల కేంద్రానికి చెందిన అబ్బన్‌వాడ్ సాయినాథ్ బైక్‌పై సారంగాపూర్ మండలం ఆలూర్ గ్రామానికి వెళ్లాడు. తిరుగుపయనంలో తురాటి ఎక్స్‌రోడ్డు సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సాయినాథ్ తలకి తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని పంజేషా మొహల్లాలో చోరీ జరిగింది. వన్‌టౌన్ ఎస్సై హరిబాబు కథనం ప్రకారం.. కాలనీకి చెందిన మహ్మద్ హరుణ్ ఈనెల 25న మహారాష్ట్రలోని ఆకోలలో తన బంధువు వివాహానికి కుటుంబ సమేతంగా వెళ్లారు. శనివారం సాయంత్రం 4 గంటలకు తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోని బీరువా పగులగొట్టి ఉండడంతోపాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, ఒక తులం బంగారం, 25 తులాల వెండీ చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

భైంసాటౌన్: సికింద్రాబాద్ నుంచి నాందేడ్ వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన మహ్మద్ ముస్తాక్(53) కుటుంబీకులతో కలిసి రైలులో నాగపూర్ వెళ్తున్నాడు. నవీపేట్-బాసర మధ్యలో గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబీకులు రైల్వే పోలీసులకు సమాచారమివ్వగా వారు బాసరలో మృతదేహాన్ని దించి ప్రైవేట్ అంబులెన్స్‌లో నాగ్‌పూర్‌కు తరలించారు.

కార్గో బస్సు ఆటో ఎదురెదురుగా ఢీ

పెంబి: మండలంలోని ఆక్నోనిమాడ సమీపంలో ఆదివారం కార్గో బస్సు ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కార్గో బస్సు అంగన్‌వాడీ సరుకులు తీసుకుని తాటిగూడ గ్రామం వైపు వెళ్తోంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఆటోలో వారి పని నిమిత్తం ఇటిక్యాలకు వెళ్లి తిరిగివస్తుండగా ఎదురెదురుగా ఢీకొంది. ఆటోలో ఉన్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని పెంబి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా..ఎవరు ఫిర్యాదు చేయలేదన్నారు.


హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయాన్ని సీఎం కేసీఆర్ ఆదివారం ప్రారంభించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.